ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రిక

**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 3 | సంచిక: 351 | పేజీలు: 6 | వెల: రూ.3/- | మంగళవారం 31 మార్చి 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

## మంత్రి పొంగులేటిని

# బర్తరఫ్ చేయండి

### గవర్నర్‌కు భారాస వినతి

### మైనింగ్ అక్రమాలపై సిటింగ్ జడ్జితో విచారణ చేయించాలని విజ్ఞప్తి



**హైదరాబాద్, మార్చి 30 (ప్రభాత ఉదయం)**

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై గవర్నర్ శివప్రతాప్ శుక్లాకు భారాస ఫిర్యాదు చేసింది. ఆయనను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని, మైనింగ్ అక్రమాలపై హైకోర్టు సిటింగ్ జడ్జితో విచారణ చేయించాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సోమవారం భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ నేతృత్వంలో హరీశ్‌రావు, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు లోక్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గవర్నర్‌తో వారి భేటీ గంటకు పైగా కొనసాగింది. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ 'పొంగులేటికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌పై గవర్నర్‌కు ఫిర్యాదు చేశాం. హిమాయత్‌సాగర్ పరిధిలో, ఓఆర్ఆర్ పరిధిలో నిబంధనలను తుంగలో తొక్కి అక్రమ మైనింగ్ చేస్తున్న విషయాన్ని తెలియజేశాం. ఎలాంటి అనుమతులు లేకుండా రెండు సంవత్సరాలుగా నిరాటంకంగా రూ.వందల కోట్ల ప్రజా సంపదను రెవెన్యూ మంత్రి కుటుంబం కొల్లగొడుతోందని వివరించాం. ఈ అంశాన్ని శాసనసభలో లేవనెత్తి, మంత్రిపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని డిమాండ్ చేస్తే.. మా పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను సభ నుంచి సస్పెండ్ చేసిన విషయాన్ని గవర్నర్ దృష్టికి తీసుకువెళ్లాం. ముఖ్యమంత్రే ..మిగతా 2లో

## ఆహార కల్తీ నియంత్రణ కోసం

# సరికొత్త వ్యవస్థ

### తెలంగాణలో ఈగల్, హైడ్రా తరహాలో మరో సరికొత్త వ్యవస్థ... రేవంత్ రెడ్డి ప్రకటన

### దేశంలోని చట్టాలను అధ్యయనం చేసి పకడ్బందీ వ్యవస్థను రూపొందిస్తామని వెల్లడి

### రైతుల హక్కులను కాపాడేందుకు కనీస మద్దతు ధర చట్టం తెచ్చామన్న సీఎం

**హైదరాబాద్, మార్చి 30 (ప్రభాత ఉదయం)**



ఈగల్, హైడ్రా తరహాలో మరో కొత్త వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. మాదక ద్రవ్యాలను నిరోధించడానికి 'ఈగల్', హైదరాబాద్ నహానగరంలో చెరువులు, నాలాలు, ప్రభుత్వ స్థలాల రక్షణ కోసం 'హైడ్రా' అనే వ్యవస్థలను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. త్వరలో ఆహార కల్తీ నియంత్రణ కోసం సరికొత్త వ్యవస్థను తీసుకువస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. సోమవారం ఆయన మీడియాతో పిచ్చాపాటిగా మాట్లాడుతూ, హైడ్రా, ఈగల్ తరహాలో సరికొత్త వ్యవస్థను తీసుకువస్తామని అన్నారు. దేశంలో చట్టాలను అధ్యయనం చేసి పకడ్బందీ వ్యవస్థను రూపొందిస్తామని తెలిపారు. రైతుల హక్కులను కాపాడేందుకు తాము కనీస మద్దతు ధర చట్టం తీసుకువచ్చామని గుర్తు చేశారు. పంటకు ధర నిర్ణయించే అవకాశం రైతుకు లేకుండా పోయిందని వాపోయారు. వారి అవసరాలను ఆసరాగా చేసుకుని దళారులు దోపిడీ చేస్తున్నారని వ్యాఖ్యానించారు.

## బీఆర్ఎస్ ఎమ్మెల్సీలపై మండలి చైర్మన్

# సస్పెన్షన్ వేటు



**హైదరాబాద్, మార్చి 30 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ శాసనమండలిలో కీలక పరిణామం చోటు చేసుకుంది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీలను మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సభ నుంచి సస్పెండ్ చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లక్ష్యంగా ప్రతిపక్షం చేపట్టిన నిరసన చివ రకు సభ్యుల బహిష్కరణకు దారితీసింది. సభ ప్రారంభం కాగానే బీఆర్ఎస్ సభ్యులు మంత్రి పొంగులేటి వ్యవహారంపై చర్చకు పట్టుబట్టారు. చైర్మన్ అనుమతించకపోవడంతో సభ్యులందరూ ఒక్కసారిగా పోడియం వద్దకు దూసుకువెళ్లారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సభా కార్యక్రమాలను అడ్డుకున్నారు. ఈ ..మిగతా 2లో

## నియోజకవర్గాల పెంపుతో

# దక్షిణాదికి అన్యాయం: సీఎం

### కేసీఆర్ ను గృహ నిర్బంధం చేశారనేది నా అనుమానం: రేవంత్ రెడ్డి

### రావణుడి వల్లే రాముడి గొప్పతనం తెలిసిందన్న రేవంత్

### కేసీఆర్ ఉండటం వల్ల తనకు గుర్తింపు వచ్చిందని వ్యాఖ్య

### కేంద్రానికి ఐదు ఉత్తరాది రాష్ట్రాలు సరిపోతాయని వ్యాఖ్య




**హైదరాబాద్, మార్చి 30 (ప్రభాత ఉదయం)**

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ విశ్రాంతి తీసుకుంటున్నారని అందరూ భావిస్తున్నారని... కానీ, ఆయన గృహ నిర్బంధంలో ఉన్నారేమో అనేది తన అనుమానం అని అన్నారు. రావణుడి వల్లే రాముడి గొప్పతనం ఏమిటో తెలిసిందని... అలాగే కేసీఆర్ ఉండటం వల్ల తనకు గుర్తింపు వచ్చిందని చెప్పారు. నియోజకవర్గాల పునర్విభజనపై బీజేపీ నేత కె. లక్ష్మణ్ చేసిన వ్యాఖ్యలపై రేవంత్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. అవి అవగాహన లేని వ్యాఖ్యలని, లక్ష్మణ్ ఎలా డాక్టర్ అయ్యారో అర్థం కావడం లేదని ఘాటుగా విమర్శించారు. నియోజకవర్గాల సంఖ్య పెరిగినా భౌగోళికంగా గ్యాప్ అలాగే ఉంటుందని, ఈ విషయంలో తెలంగాణను తెలివిగా మోసం చేస్తున్నారని ఆరోపించారు. సీట్ల పెంపు విషయంలో ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య భారీ వ్యత్యాసం కనిపిస్తోందని అన్నారు. కేంద్రానికి కేవలం ఐదు ఉత్తరాది రాష్ట్రాల సీట్లు సరిపోతాయని, అదే జరిగితే దక్షిణాది రాష్ట్రాల గొంతు నొక్కేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సీట్ల పెంపులో ఈ వ్యత్యాసం కొనసాగితే భవిష్యత్తులో బండి సంజయ్, కిషన్ రెడ్డి వంటి నేతలకు రాజకీయంగా అవకాశాలు ఉండవని, దేశంలో నియంత పోకడలు పెరుగుతాయని సెటైర్లు వేశారు.




# జీవో 317ను వెంటనే రద్దు చేయాలి

### వన్‌టైం రిలీఫ్ కింద స్వస్థలాలకు ట్రాన్స్‌ఫర్ చేయాలి

### గతంలో పిసిసి చీఫ్‌గా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

### సిఎం రేవంత్ రెడ్డికి కల్వకుంట్ల కవిత బహిరంగ లేఖ

2లో..

# 'రాష్ట్ర అభివృద్ధికి శాంతి పునాది'

### అసోంలో ఒకప్పుడు అస్థిరత, అశాంతి

### గత దశాబ్ద కాలంలో అన్నీ మారిపోయాయ్: ప్రధాని మోదీ

### అసోంలో బూత్ స్థాయి కార్యకర్తలతో మాట్లాడిన మోదీ

### కాంగ్రెస్ దుష్పరిపాలన గురించి

### తొలిసారి ఓటు వేస్తున్న వారికి తెలియజేయాలని వెల్లడి



**న్యూఢిల్లీ, మార్చి 30 (ప్రభాత ఉదయం)**

అసోంలో ఒకప్పుడు దీర్ఘకాలం అస్థిరత, అశాంతి నెలకొన్నప్పటికీ, గత దశాబ్దంలో పరిస్థితులు పూర్తిగా మారిపోయాని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. రాష్ట్రంలో శాంతిని నెలకొల్పేందుకు బీజేపీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రయత్నించిందని తెలిపారు. ఎన్నికల సమరానికి సిద్ధమవుతున్న అసోంలో 'మేరా బూత్ సబ్సే మజ్‌బూత్ సంవాద్' కార్యక్రమంలో భాగంగా బీజేపీ బూత్ స్థాయి కార్యకర్తలతో మాట్లాడుతూ మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు.

గతంలో హింసతో అల్లకల్లోలమైన అసోం ఇప్పుడు నూతన ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతోందని మోదీ అన్నారు. బీజేపీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వం శాంతి స్థాపన కోసం కృషి చేయడంతో పరిస్థితులు మారాయని పేర్కొన్నారు. ఈశాన్య ప్రాంతంలో వివిధ సంస్థలతో 12 శాంతి ఒప్పందాలు కుదుర్చుకున్నామని తెలిపారు. ఒక రాష్ట్ర అభివృద్ధికి శాంతి అత్యవసరమని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. గత పదేళ్లలో ..మిగతా 2లో

# మంత్రి పొంగులేటిని బర్తరఫ్ చేయండి



మొదటి పేజీ తరువాయి...

హోంశాఖ బాధ్యతలు నిర్వర్తిస్తున్నందున సీఐడీ విచారణతో న్యాయం జరుగుతుందన్న నమ్మకం లేదని, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలతో కూడిన సభా సంఘాన్ని లేదా, ఇండిపెండెంట్ జ్యుడిషియల్ విచారణ కావాలని శివప్రతాప్ శుక్లాను కోరాం. అన్ని పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటానని గవర్నర్ హామీ ఇచ్చారు. ప్రభుత్వం దిగిరాకపోతే ప్రజాక్షేత్రంలో ఎండగడతాం. బాధితులకు న్యాయం జరిగేదాకా, అక్రమ మైనింగ్ ఆగే వరకు పోరాటం చేస్తాం. ఎవరు అడిగినా విచారణకు ఆదేశిస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి మాట మార్చి, పొంగులేటి పైన విచారణ చేయకుండా వెనక్కిపోయారు. రాష్ట్ర ప్రభుత్వం విచారణ చేస్తే అమృత్ కుంభకోణం, ఫోన్ ట్యాపింగ్, సింగరేణి, హిల్ట్ పాలసీ.. ఇలా దాదాపు 14 అంశాల పైన ఆధారాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం. ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి పొంగులేటిపై చర్యలు తీసుకొని చిత్తశుద్ధి నిరూపించుకోవాలి' అని కేటీఆర్ వెల్లడించారు. గవర్నర్‌ను కలిసిన వారిలో మధుసూదనాచారి, సబితారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, వేముల ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, మల్లారెడ్డి, సునీతారెడ్డి, కోవ లక్ష్మి, ఎల్.రమణ, పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

**గన్‌పార్కులో భారాస ఎమ్మెల్సీల నిరసన**

నారాయణగూడ, న్యూస్‌టుడే: మంత్రి పొంగులేటి మైనింగ్ వ్యవహారంపై సభాసంఘం వేయాలి లేదా హైకోర్టు సిటింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని భారాస ఎమ్మెల్సీలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం గన్‌పార్కులోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద వారు నిరసన తెలిపారు. ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, తక్కెళ్లపల్లి రవీందర్, సురభి వాణీదేవి, తాతా మధు, పోచంపల్లి శ్రీనివాస్, నవీన్‌రెడ్డిలు ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం ఎమ్మెల్సీలు పాదయాత్రగా శాసనమండలికి వెళ్లారు.

# 'రాష్ట్ర అభివృద్ధికి శాంతి పునాది'

మొదటి పేజీ తరువాయి...

నిజాయితీగా అమలు చేసిన శాంతి ఒప్పందాల వల్ల అసోంలో స్థిరత్వం నెలకొన్నట్లు చెప్పారు. యువత భవిష్యత్తు భద్రత కోసం బీజేపీ ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు.

**కాంగ్రెస్‌పై విమర్శలు**

మునుపటి కాంగ్రెస్ ప్రభుత్వాలు కేవలం వార్తల్లో నిలిచేందుకు ఒప్పందాలు చేసేవని మోదీ విమర్శించారు. ఆ ఒప్పందాలు కాగితాలకే పరిమితమయ్యాయని, యువతను నిరాశలోకి నెట్టాయని అన్నారు. బోడో సమస్య సహా అనేక అంశాల్లో ప్రజలను కాంగ్రెస్ మోసం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో తిరుగుబాటుదారులు, విద్యార్థి సంఘాలతో చేసుకున్న ఏ ఒప్పందమూ ఫలించలేదని విమర్శించారు.

**మొదటిసారి ఓటర్లకు పిలుపు**

మొదటిసారి ఓటు వేయనున్న యువతకు గత కాంగ్రెస్ ప్రభుత్వాల దుష్పరిపాలన గురించి గుర్తు చేయాలని పార్టీ కార్యకర్తలకు ప్రధాని మోదీ సూచించారు. చిన్న తప్పిదం కూడా రాష్ట్రాన్ని మళ్లీ వెనక్కి నెడుతుందని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న ఏఐ రూపొందించిన వీడియోలపై ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. అలాగే అసోంలో ఈసారి కూడా హ్యాట్రిక్ విజయం లక్ష్యంగా పనిచేస్తున్నట్లు మోదీ తెలిపారు.

**బంగ్లాదేశ్ చొరబాటుదారులను అనుమతించింది కాంగ్రెస్ : నితిన్ నబీన్**

కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు బంగ్లాదేశీయులను అసోంలోకి అక్రమంగా ప్రవేశించేందుకు సహకరించిందని బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న సమయంలో అక్రమ వలసలను నియంత్రించలేదని, దీంతో బంగ్లాదేశీ చొరబాటుదారులు అసోంలోకి పెద్ద ఎత్తున ప్రవేశించారని అన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పరిస్థితిని మార్చి అక్రమ వలసదారులకు నిష్క్రమణ చూపిస్తున్నామని తెలిపారు. మోరిగావ్ జిల్లాలో ఎన్నికల ప్రచారంలో ప్రసంగిస్తూ ఈ మేరకు మాట్లాడారు.

**రాహుల్ గాంధీపై నబీన్ విమర్శలు**

లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీపై కూడా నితిన్ నబీన్ విమర్శలు గుప్పించారు. ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో అసోం సంప్రదాయ కండువా గమోచాను ధరించలేదని, ఇది రాష్ట్ర ప్రజల భావాలను దెబ్బతీసిందని అన్నారు. అదే సమయంలో మసీదులకు వెళ్లినప్పుడు టోపీ ధరిస్తారని ఆరోపించారు.

**'బీజేపీ పాలనలో అభివృద్ధి'**

గత పది సంవత్సరాల్లో బీజేపీ పాలనలో అసోంలో భారీ అభివృద్ధి జరిగిందని నబీన్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో తీవ్రవాదం, హింస, పెట్టుబడిదారుల వెనుదిగడం, యువత నిరాశ వంటి సమస్యలు ఉండేవని గుర్తు చేశారు. అలాంటి పరిస్థితులు మళ్లీ రాకుండా ప్రజలు జాగ్రత్తగా నిర్ణయం తీసుకోవాలని పిలుపునిచ్చారు.

**ఏప్రిల్ 9న అసోం అసెంబ్లీ ఎన్నికలు**

అసోంలో 126 అసెంబ్లీ స్థానాలకు ఒకే దశలో ఏప్రిల్ 9న ఎన్నికలు జరగనున్నాయి. మే 4న ఓట్ల లెక్కింపు ఉంటుంది. 2016 నుంచి బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం అక్కడ అధికారంలో ఉంది. హ్యాట్రిక్ కోసం బీజేపీ ప్రయత్నిస్తుండగా, ఈసారి అసోంలో అధికారాన్ని చేపట్టాలని కాంగ్రెస్ విశ్వప్రయత్నాలు చేస్తోంది.

# జీవో 317ను వెంటనే రద్దు చేయాలి

**వన్‌టైం రిలీఫ్ కింద స్వస్థలాలకు ట్రాన్స్‌ఫర్ చేయాలి**

**గతంలో పిసిసి చీఫ్‌గా ఇచ్చిన హామిని నిలబెట్టుకోవాలి**

**సిఎం రేవంత్ రెడ్డికి కల్వకుంట్ల కవిత బహిరంగ లేఖ**

జీవో నం.317 బాధితులకు వన్‌టైం రిలీఫ్ కింద స్వస్థలాలకు ట్రాన్స్‌ఫర్ చేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కవిత బహిరంగ లేఖ రాశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2021 డిసెంబర్ 6న జారీ చేసిన జీవో నం.317 వల్ల వేలాది మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని లేఖలో పేర్కొన్నారు. జీవో 317ను వెంటనే రద్దు చేసి ఉద్యోగులకు సొంత జిల్లాల్లో పోస్టింగ్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు సీఎం రేవంత్ రెడ్డి కూడా ఈ అంశంపై అప్పటి సీఎం కేసీఆర్ లేఖ రాసిన విషయాన్ని కవిత గుర్తు చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ.. జీవో 317ను సమీక్షించి బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో కూడా ఈ విషయాన్ని కాంగ్రెస్ స్పష్టంగా పొందుపరిచినట్లు కవిత పేర్కొన్నారు. ప్రస్తుత మంత్రివర్గంలో ఉన్న పలువురు నాయకులు గతంలో ఈ బాధితులకు న్యాయం చేస్తామని హామీలు ఇచ్చిన విషయాన్ని కవిత లేఖలో గుర్తు చేశారు. జీవో 317 వల్ల ఉద్యోగులు మానసిక క్షోభకు గురవుతున్నారని పేర్కొన్నారు. వెంటనే వన్ టైం రిలీఫ్ కింద ఉద్యోగులు, ఉపాధ్యాయులను స్థానికత ఆధారంగా స్వస్థలాలకు బదిలీ చేయాలని కోరారు. స్థానికతను గుర్తించే నిబంధనల్లో సమూల మార్పులు చేసి.. ఉద్యోగులకు సొంత జిల్లాల్లో పోస్టింగ్‌లు ఇవ్వాలని కవిత లేఖలో పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షుడి హోదాలో మీరు, ప్రస్తుత మీ మంత్రివర్గంలో ఉన్న పలువురు నాయకులు ప్రభుత్వ ఉద్యోగులను మానసిక క్షోభకు గురి చేస్తున్న జీవో నం.317 బాధితులకు న్యాయం చేస్తామని పలు సందర్భాల్లో హామీ ఇచ్చారని లేఖలో గుర్తు చేశారు. వెంటనే జీవో నం.317 బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయులకు వన్ టైం రిలీఫ్ కింద వారి స్థానికత ఆధారంగా వారి స్వస్థలాలకు బదిలీ చేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. అలాగే స్థానికతను గుర్తించే నిబంధనల్లోనూ సమూల మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ తర్వాత అప్పటికే వివిధ ఉమ్మడి జిల్లాల్లో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సీనియారిటీ ప్రాతిపదికన కొత్త జిల్లాల్లో పోస్టింగ్స్ ఇచ్చారు. సీనియారిటీకి ప్రాధాన్యత ఇచ్చే క్రమంలో ఎనిమిదేళ్లు, అంతకన్నా తక్కువ సర్వీస్ ఉన్న ఉద్యోగులు, టీచర్లు ఆయా ఉమ్మడి జిల్లాల్లో కొత్తగా ఏర్పాటు చేసిన ఏదో ఒక జిల్లాకు అలాట్ అయ్యారు. ఇలా ఉద్యోగులను కొత్త జిల్లాల వారీగా సర్దుబాటు చేయడానికి జీవో నం.317 తీసుకు వచ్చారు. . 2021 డిసెంబర్ 6న అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం జారీ చేసిన జీవో నం.317 ద్వారా వేలాది మంది ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే ఆ జీవోను రద్దు చేసి ఉద్యోగులకు వారి సొంత జిల్లాల్లో పోస్టింగ్స్ ఇవ్వాలని కోరుతూ పీసీసీ అధ్యక్షుడి హోదాలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌కి మీరు లేఖ రాసిన విషయం గుర్తు ఉండి ఉంటుందని భావిస్తున్నాం. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే జీవో నం.317ను సమీక్షించి బాధిత ఉద్యోగులకు న్యాయం చేస్తామని మీరు హామీ ఇచ్చారు. జీవో నం.317 బాధితుల సమస్యలకు పరిష్కారం కనుగొనేందుకు అప్పటి సీఎస్ శాంతి కుమారి ఆధ్వర్యంలో సబ్ కమిటీని ఏర్పాటు చేశారు. కానీ ఇప్పటి వరకు ఆ సబ్ కమిటీ నివేదిక ఏమయ్యిందో అర్థం కాని పరిస్థితి. శాంతి కుమారి కమిటీ ఇచ్చిన నివేదిక బయట పెడితే తప్ప జీవో నం.317 బాధితులు ఎంతమంది అనే విషయంపై స్పష్టత వచ్చే అవకాశం లేదు. సబ్ కమిటీ తన నివేదిక సమర్పించి ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వం దానిని బయట పెట్టకపోవడంలో ఆంతర్యం ఏమిటో చెప్పాలని కవిత తెలిపారు.



# ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అవినీతి, అక్రమాల్లో హరీష్ రావుకు వాటా ఎంత!?

**పటాన్ చెరు కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ సూటి ప్రశ్న**

**గూడెం మధుసూదన్ రెడ్డి కోట్ల మైనింగ్ అక్రమాలు చిన్న తప్పా !?**

**పటాన్ చెరు, మార్చి 30 (ప్రభాత ఉదయం):**

పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, ఆయన సోదరుడు గూడెం మధుసూదన్ రెడ్డి అవినీతి, అక్రమ సంపాదనలో మాజీ మంత్రి హరీష్ రావు భాగస్వామ్యం ఎంతో చెప్పాలని పటాన్ చెరు కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ సూటిగా ప్రశ్నించారు. సోమవారం నిర్వహించిన సుదీర్ఘ విలేకరుల సమావేశంలో ఆయన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, ఆయన సోదరుడు అవినీతి అక్రమాల గురించి ఏకరువు పెట్టారు.పటాన్ చెరు ప్రాంతంలోని చెట్లు, గుట్టలు రాళ్లను అడిగినా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆయన సోదరుడు అవినీతి, అక్రమాల బాగోతం చెబుతాయని ఎద్దేవా చేశారు.పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, ఆయన సోదరుడు గూడెం మధుసూదన్ రెడ్డి అవినీతి, అక్రమాలు, భూకబ్జాలను మాజీ మంత్రి హరీష్ రావు వెనకేసుకొని రావడం బాధాకరమని ,అసెంబ్లీలో మైనింగ్ పై చర్చ జరిగిన సందర్భంలో పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తమ్ముడు గూడెం మధుసూదన్ రెడ్డి చేసిన వందల కోట్ల రూపాయల అవినీతిని చిన్న తప్పు అని ప్రస్తావించడం అవినీతికి మద్దతు పలకడమే అని ఆరోపించారు. హరీష్ రావు నిజాయితీ పరుడైతే గూడెం మధుసూదన్ రెడ్డి మైనింగ్ అవకతవకలపై సిబి సీఐడివిచారణ, సిట్ దర్యాప్తు వేయాలని కోరాలని, అలా కోరి మాజీ మంత్రి హరీష్ రావు కు అవినీతిలో వాటా లేదని నిరూపించుకోవాలని నిలదీశారు హరీష్ రావు మంత్రిగా ఉన్నప్పుడే లక్డారంలో అక్రమ మైనింగ్ జరిగిందని, అప్పటి మైనింగ్ అధికారులు క్లోజర్ లెటర్ ఇవ్వడం నిజం కాదా ? 380కోట్ల అక్రమ మైనింగ్ సంపాదన చిన్న విషయమా.? అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి కబ్జాలు, అక్రమ మైనింగ్ లో హరీష్ రావుకు భాగస్వామ్యం, వాటా ఉన్నట్లు అనుమానాలు ఉన్నాయని అనుమానం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం వందల.కోట్ల రూపాయల స్కాం జరిగితే మంత్రిగా ఉండి హరీష్ రావు ఏం చేశారని గట్టిగా నిలదీసారు.ఇంద్రేశం 450 సర్వేనంబర్ లో 1.12ఎకరాల భూమి, పోచారం సర్వే నంబర్ 62లో వంద ఇళ్లు, భూ కబ్జాలతో వందల, వేల కోట్ల రూపాయల అక్రమార్జనకు పాల్పడిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, ఆయన అనుచరులపై చర్యలేవని ప్రశ్నించారు . పాటి గ్రామంలోని ఆనంద్ నగర్ లో ఎమ్మెల్యే మేనల్లుడు జంగారెడ్డి కబ్జాచేసి ప్లాట్ల ఓనర్లపై దౌర్జన్యం చేస్తే హైడ్రా కాపాడిందని,ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి చేసిన అక్రమాలకు వాళ్లు ఇళ్లలో కన్నా జైళ్లలోనే ఎక్కువ రోజులు ఉండడానికి అర్హులన్నారు. కల్వకుంట్ల కవిత 5 నెలలు జైలులో ఉంటే బాధపడని హరీశ్ రావుకు గూడెం మధుసూదన్ రెడ్డి నెల రోజుల జైలుకే బాధపడడం సిగ్గుచేటన్నారు. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, ఆయన తమ్ముడు మధుసూదన్ రెడ్డికి సంబంధించిన లక్ష గజాల డాక్యూమెంట్లు, కిలోల కొద్ది బంగారం, వేల కోట్ల ఆస్థుల పత్రాలను ఈడి అటాచ్ చేయడం దేశంలోనే మొదటి సారి అని విమర్శించారు. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అవినీతి, అక్రమాలపై పోరాడుతామని అన్నారు. తన స్వార్థం కోసం పార్టీలు మారి అవకాశవా రాజకీయాలు చేయడంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆరితేరారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీని పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలో బలోపేతం చేయడానికి నాయకులతో కలిసికట్టుగా అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్సీలపై మండలి చైర్మన్ సస్పెన్షన్ వేటు

మొదటి పేజీ తరువాయి...

క్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీల తీరుపై మండలి చైర్మన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ్యులు సీట్లలోకి వెళ్లాలని పదే పదే విజ్ఞప్తి చేసినా వినకపోవడంతో సభలో గందరగోళం నెలకొంది. పోడియం వద్ద ఆందోళన చేస్తున్న సభ్యులను అడ్డుకునేందుకు మార్షల్స్ రంగంలోకి దిగారు. ఈ క్రమంలో మార్షల్స్ – బీఆర్ఎస్ ఎమ్మెల్సీల మధ్య తీవ్ర స్థాయిలో తోపులాట చోటుచేసుకుంది. సభ్యుల ప్రవర్తన సభా నియమావళికి విరుద్ధమని భావించిన చైర్మన్, బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు అందరినీ ఒకరోజు పాటు సభ నుండి సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. సస్పెన్షన్ వేటుకు గురైన వారిలో మధుసూదనాచారి, రవీందర్‌రావు, దేశపతి శ్రీనివాస్, ఎల్. రమణ, యాదవరెడ్డి, సుంకరి రాజు, నవీన్‌కుమార్‌రెడ్డి, మధుసూదన్, వాణీదేవి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎం.కోటిరెడ్డి ఉన్నారు. సస్పెన్షన్ అనంతరం బయటకు వచ్చిన సభ్యులు మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రతిపక్షం గొంతు నొక్కేందుకు ప్రభుత్వం కుట్ర పన్నిందని మండిపడ్డారు. మంత్రిపై వస్తున్న తీవ్రమైన ఆరోపణల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే ఈ సస్పెన్షన్ డ్రామా ఆడారని ఆరోపించారు. తాము సస్పెన్షన్లకు భయపడబోమని, ప్రజా క్షేత్రంలో మంత్రి అక్రమాలను ఎండగడతామని స్పష్టం చేశారు.

# పటాన్‌చెరులో ప్రభుత్వ భూమి ఆక్రమణలపై ఎమ్మార్వోకు కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు





**పటాన్ చెరు,మార్చి 30 (ప్రభాత ఉదయం):**

పటాన్‌చెరు మండలం పరిధిలోని పోచారం గ్రామ సర్వే నెంబర్ 62లో జరుగుతున్న ప్రభుత్వ భూమి ఆక్రమణలపై కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు 42 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఈ ప్రభుత్వ స్థలంలో కొందరు అక్రమంగా ఇళ్లు, ఇతర నిర్మాణాలు చేపట్టారని ఆరోపిస్తూ సోమవారం నాడు కాంగ్రెస్ నాయకులు ఎమ్మార్వోకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.సర్వే నెంబర్ 62తో పాటు నక్షా బాట పోచారం గ్రామం, రామేశ్వరబండ, ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నెంబర్ 453 మధ్య ఉన్న పౌనదిని సమగ్రంగా సర్వే చేయాలని వారు డిమాండ్ చేశారు. అక్రమ నిర్మాణాల వల్ల విలువైన ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతోందని పేర్కొంటూ, తక్షణమే అధికారులు స్పందించి హద్దులు గుర్తించి రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వ భూములను కాపాడటంతో పాటు చట్టవిరుద్ధంగా ఆక్రమణలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు అధికారులను విజ్ఞప్తి చేశారు.

# కబ్జాకు గురైన పార్కు,రోడ్లను కాపాడాలి







**రంగారెడ్డి జిల్లా ఏఐటీయూసీ కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి**

**రాజేంద్రనగర్,మార్చి30(ప్రభాత ఉదయం)**

కబ్జాకు గురైన పార్కు,రోడ్లని కాపాడాలని హైడ్రా కమిషనర్ ను రంగారెడ్డి జిల్లా ఏఐటీయూసీ కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి కలిశారు.రంగారెడ్డి జిల్లా ఏఐటీయూసీ కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి బుద్ధ భవన్ లో ప్రజావాణి సందర్భంగా హైడ్రా కమిషనర్ కు టీఎన్జీవోస్ కాలనీలోని పార్క్ స్థలాలని కాపాడాలని,40 ఫీట్ల రోడ్డుని కబ్జాకు గురి చేసినటువంటి వారిపై తగిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రం ఇవ్వడం జరిగింది.హైడ్రా కమిషనర్,అధికారులు కాలనీలోని కబ్జాకు గురైన పార్కులను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పడం జరిగింది.ఈ విధంగా పద్మశాలిపురం,వివేకానంద స్టాచ్యూ,శ్రీ రామకృష్ణ సేవా సమితి నుండి 40ఫీట్ల రోడ్డు కొందరు కబ్జా చేయడం జరిగింది.ఈ విషయాలపై హైడ్రా అధికారులతో ప్రజావాణిలో మాట్లాడడం జరిగింది.హైడ్రా కమిషనర్ కు డిఎన్జీవోస్ కాలనీ లేఔటు కూడా ఇవ్వడం జరిగింది.పార్కు,రోడ్లను ఎవరు కబ్జా చేసినా ఉపేక్షించేది లేదని అధికారులు చెప్పడం జరిగింది.కబ్జాకు గురైన స్థలాలను కాపాడుతామని చెప్పడం జరిగింది.

# దుర్గానగర్‌లో దుర్గంధంతో ప్రజల ఇబ్బందులు

### పట్టించుకోని ప్రజా ప్రతినిధులు

**బుద్వేల్, మార్చి 30 (ప్రభాత ఉయదం)**

కాటేదాన్ డివిజన్ దుర్గానగర్ లో డ్రైనేజీ సమస్య తో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. స్థానిక జయదుర్గాదేవీ దేవాలయం వెనుకాల గల దుర్గా ప్లే స్కూల్ పరిసరాలలో మురుగునీరు వెళ్లడానికి వేసిన డ్రైనేజీ పైపు లైన్ సరిగ్గా లేకపోవడంతో డ్రైనేజీ నీరు రోడ్డుపైన నిలుస్తుంది. దీంతో దోమలు వృద్ధి చెంది స్థానిక ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు. దుర్వాసన వెదజల్లుతుంది. కొన్ని చోట్ల మ్యాన్ హోల్లు నోరు తెరచి ప్రమాదాలకు సూచికగా మారాయి. దుర్గానగర్ లో నేటికి ఓపెన్ నాలాలు దర్శనమిస్తున్నాయి. నాలాల పైన కప్పు లేకపోవడంతో దుర్వాసన వెదజల్లుతుంది.


**సరైన ప్రణాళికలు లేకపోవడం వల్లే :**

దుర్గానగర్ లో నివాసం ఉంటున్న ప్రజలను, ఇళ్లను బట్టి డ్రైనేజీ పైపులైన్ వేయాల్సి ఉంటుంది. అలా కాకుండ సామార్థ్యానికి తక్కువ గా ఉన్న పైపులైన్ వేయడంతో ఇబ్బందులు తప్పడం లేదు. జలమం డలి అధికారులు ఇప్పటికైన స్పందించి ప్రజలు ఇబ్బందులు పడకుండ పైపులైన్ వేయాలని స్థానికులు కోరుతున్నారు.

**బీజేపీ నాయకుల పర్యటన :**

దుర్గానగర్ లో డ్రైనేజీ సమస్యల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను బీజేపీ మైలార్దేవుపల్లి డివిజన్ – 2 అధ్యక్షులు సూరెడ్డి వినయ్ రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు అడికె రాజు, బొమ్మరాజు నర్సింహ్మ, బల్ల శ్రీనివాస్ యాదవ్, అడికె మహేందర్, జి. అంజి, డి. వేణు, వి. నిఖిల్, వి. బాబూజీ, కౌం డల్, సాయికుమార్లతో కలసి పరిశీలించారు. డ్రైనేజీ వైపు లైన్లు నూతనంగా వేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే, కార్పొరేటర్లు స్థానికంగానే ఉన్నా దుర్గానగర్ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మం డిపడ్డారు. జీహెచ్ఎంసీ లో ఉన్నామా.. మారు మూల గ్రామంలో ఉన్నామా అన్నట్లు దుర్గానగర్ పరిస్థితి ఉందని వాపోయారు.


రోడ్డు పై నిలచిన నీరు ను చూపుతున్న బీజేపీ నాయకులు సూరెడ్డి వినయ్ రెడ్డి తదితరులు


నోరు తెరిచిన మ్యాన్ హోల్

**అంచనాలు తయారు చేస్తాం: జలమండలి మేనేజర్ ఎంఎ భాధర్ :**

తాను జలమండలి మైలార్దేవుపల్లి విభాగం మేనేజరుగా బాధ్యతలు స్వీకరించి వారం రోజులే అవుతుంది.

సమస్యలను గుర్తించి అంచనాలు తయారు చేస్తాం. పనులు మంజూరు అయ్యాక డ్రైనేజీ పైపులైన్ పనులు చేపడతాం. దుర్గానగర్ లో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు చూసి ఉన్నతా ధికారులకు వివరిస్తాను.


మారం జగదీశ్వర్, ఎస్ ఎం హుస్సేనీ ముజీబ్ లను సన్మానిస్తున్న రాజేంద్రనగర్ తాలూకా ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకులు

## టీఎన్జీవోస్ కేంద్ర సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు సన్మాణం

**బుద్వేల్, మార్చి 30 (ప్రభాత ఉదయం)**

టీఎన్జీవోస్ కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఏకగ్రీవంగా రెండవ సారి నియమితులైన మారం జగదీశ్వర్, ఎస్ ఎం హుస్సేనీ ముజీబ్ లను రాజేంద్రనగర్ తాలూకా ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం టీఎన్ వోస్ భవన్ లో సన్మానించారు. ఉద్యోగుల హక్కుల కోసం నిస్వార్థంగా పోరాడుతున్న మారం జగదీశ్వర్, ఎస్ఎం హుస్సేనీ ముజీబ్ కు భగవంతుడు మంచి ఆయురారోగ్యాలనిచ్చి ఆశీర్వదించాలని కోరారు. సన్మానించిన వారిలో రాజేంద్రనగర్ తాలూక ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ ఎం శ్రీనివాస్ యాదవ్, కన్వీనర్ ఎస్ యాదయ్య ముదిరాజ్, ఉద్యోగ సంఘాల నాయకులు ఎస్ జయరాం, రవీందర్రెడ్డి, విశ్రాంత ఉద్యోగ సం ఘం నాయకులు ఎం ఎ నయీమ్, జి అంజయ్యగౌడ్, రవీందర్ గౌడ్, ఎస్ వెంకటేశం లు ఉన్నారు.


మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అక్రమ మైనింగ్ వ్యాపారాన్ని అరికట్టాలని కోరుతు సోమవారం బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు కొత్వాల్ గూడ లోని అక్రమ మైనింగ్ ప్రాంతానికి వెళుతున్న వారిని శంషాబాద్ వద్ద పోలీసులు అడ్డుకోవడంతో అక్కడే బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న రాజేంద్రనగర్ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు శీలం తిరుపతిరెడ్డి తదితరులు

-బుద్వేల్, ప్రభాత ఉదయం


డాక్టర్ సుచరితకు ఉత్సవాల ఆహ్వాన పత్రం అందజేస్తున్న రాజేంద్రనగర్ సర్కిల్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు

## మహనీయుల జయంతి ఉత్సవాలకు జాతీయ షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణ సమితి జాతీయ అధ్యక్షులు దళిత రత్న రాజు ఉస్తాద్ ను ఆహ్వానించిన రాజేంద్రనగర్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు

**రాజేంద్రనగర్, మార్చి 30(ప్రభాత ఉదయం)**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంత్ ఉత్సవాల రాజేంద్రనగర్ సర్కిల్ కమిటీ ప్రతినిధులు జాతీయ షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణ సమితి జాతీయ అధ్యక్షులు దళిత రత్న రాజు ఉస్తాద్, విశ్రాంతి డి జి పి డి కె రత్నం సతీమణి డాక్టర్ డి సుచరిత లకు ఆహ్వాన పత్రిక అందజేసి ఆహ్వానించారు. ఆహ్వానించిన వారిలో రాజేంద్రనగర్ సర్కిల్ ఉత్సవ కమిటీ చైర్మన్ దళిత రత్న డి రమేష్, ఉత్సవాల కమిటీ వ్యవస్థాపక అధ్యక్షులు, దళిత రత్న జీవన్ దాస్, దళిత రత్న పచ్చా శ్రీనివాస్, దళిత రత్న డాక్టర్ వేము వందనం, దళిత రత్న మంత్రి చంద్ర శేఖర్, దళిత రత్న డి సత్యన్నారాయణ, దళిత రత్న శ్రీ ఎమ్ సి వీరన్న, దళిత రత్న శ్రీ శైలం తదితరులు ఉన్నారు.


రాజు ఉస్తాద్ ను ఆహ్వానిస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు

## రాజేంద్రనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా రవికాంత్ రెడ్డి

**రాజేంద్రనగర్,మార్చి30(ప్రభాత ఉదయం)**




రాజేంద్రనగర్ ఉప్పరపల్లి బార్ అసోసియేషన్ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి.210 మంది న్యాయవాదులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.ఎన్నికల అధికారిగా ఎస్. వెంకట్ రెడ్డి వ్యవహరించారు.పలువురు న్యాయవాదులు ఓట్లు వేసి,ఎవరు గెలిచినా..సంఘ అభివృద్ధితో పాటు,సభ్యుల సమస్యలను పరిష్కారించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు.రాజేంద్రనగర్ ఉప్పరపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షునికి సమాన ఓట్లు.. రాజేంద్రనగర్ ఉప్పరపల్లి బార్ అసోసియేషన్‌కు సోమవారం నిర్వహించిన ఎన్నికల్లో రాజేంద్రనగర్ ఉప్పరపల్లి కోర్టు బార్ అసోసియేషన్‌లో అధ్యక్షులుగా రవికాంత్ రెడ్డి,సుదర్శన్,రియాజ్ పాషా,లు పోటీపడ్డారు.రవికాంత్ రెడ్డికి 89ఓట్లు రాగా,సుదర్శన్,కు 89ఓట్లు సమానంగా పోలయ్యాయి.మూడోస్థానంలో నిలిచిన రియాజ్ పాషాకు 29 లభించాయి.అధ్యక్షులకి ఇరువురికి సమాన ఓట్లు లభించాయి.ఇరువురికి సమాన ఓట్లు లభించడంతో అధ్యక్షుని స్థానంలో ఒక్కొక్కరికి ఆరు నెలలు కాల పరిమితి నిర్ణయించారు.మొదటి ఆరు నెలలు అధ్యక్షునిగా రవికాంత్ రెడ్డికి అవకాశం లభించింది.ప్రధాన కార్యదర్శులుగా బి.నరసింహచారి ఎన్నికయ్యారు.


బుద్వేల్ కు చెందిన మహేశ్వరి వైద్యం కోసం రూ.2.5 లక్షల విలువ చేసే లెటర్ ఆఫ్ క్రెడిట్ ను వారి కుటుంబ సభ్యులకు అందచేస్తున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్. చిత్రంలో కాంగ్రెస్ నాయకులు రగడంపల్లి శ్రావణ్, శ్రీ శ్రీనివాస సేవా సమితి అధ్యక్షుడు పెండ్యాల సాయి మల్లిక్, తెలంగాణ ఎమ్మార్పీఎస్ నాయకుడు గుంటి రమేష్ తదితరులు

## మూగ యువతిపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

**బుద్వేల్, మార్చి 30 (ప్రభాత ఉదయం)**


మహ్మద్ అఖిల్

ఇంట్లో ఒంటరిగా ఉన్న మూగ యువతి పై అత్యాచారయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తిని అత్తాపూర్ పోలీసులు 48 గంటల లోపు అరెస్ట్ చేసి సోమవారం రిమాండ్ కు తరలించారు. రాజేంద్రనగర్ డీసీపీ ఎస్ శ్రీనివాస్ కథనం ప్రకారం వివరాలు ఈ విదంగా ఉన్నాయి... హసన్నగర్ కు చెందిన ఓ మూగ యువతి (25) తమ బందువుల వద్ద నివాసం ఉంటుంది. మార్చి 28న ఆమె బంధువులు బ్యాంకు పని ఉందని ఉదయం 9 గంటలకు బయటకు వెళ్లారు. ఇంట్లో మూగ యువతి ఒక్కరే ఉన్నారు. అదే సమయంలో మూగ యువతి బంధువు బార్కాస్ కు చెందిన మహ్మద్ అఖిల్ (35) వారికి ఇంటికి వచ్చి ఒంటరిగా ఉన్న మూగ యువతి పై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఉదయం 11 గంటలకు ఇంటికి వచ్చిన మూగ యువతి బందువు గమనించి అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మూగ యువతి పై అత్యాచారానికి పాల్పడిన మహ్మద్ అఖిల్ ను సోమవారం అరెస్ట్ చేశారు. అతనిపై బీఎన్ఎస్ సెక్షన్ 64(2)(ఎఫ్) (కె) క్రింద కేసు నమోదు చేశారు. ఈ కేసును చేదించడంలో రాజేంద్రనగర్ ఏసీపీ తుల శ్రీనివాస్, అత్తాపూర్ ఇన్స్ పెక్టర్ కె నాగేశ్వర్ రావు, హెడ్ కానిస్టేబుల్ ఇంతియాజ్ అహ్మద్, కానిస్టేబుల్ కె వీరేశ్ లు ఎంతో చాకచక్యంగా వ్యవహరించి ఈ కేసును చేదించారని డీసీపీ వారిని అభినందించారు.

## తనకు ప్రత్యర్థులతో ప్రాణహాని ఉంది సైఫీ కాలనీ నివాసి షహబాజ్

### షహబాజ్ చెప్పే దాంట్లో వాస్తవం లేదు : ఎస్ఐ విశ్వనాథ్ రెడ్డి

**బుద్వేల్, మార్చి 30 (ప్రభాత ఉదయం)**



నా ప్రాణానికి హాని ఉంది, తనకు రక్షణ కల్పించాలని మైలార్దేవుపల్లి సైఫీ కాలనీకి చెందిన మహ్మద్ షహబాజ్ వాట్సాప్ ద్వారా నగర పోలీస్ కమిషనర్ కు విజ్ఞప్తి చేస్తున్న విషయం చర్చనీయాంశమైంది. ఇదే విషయమై షహబాజ్ ఈ మార్చి 23న మైలార్దేవుపల్లి పోలీసులకు లిఖిత పూర్వకంగా పిర్యాదు చేశారు. భూ కబ్జాదారులు, రౌడీ షీటర్లు గా ఉన్న వారు తనపై నిఘా పెట్టారని వాపోయారు. తనను చంపుతామని తన వెంట సద్దాం అనే వ్యక్తి వారి మనుషులను పెట్టాడని చెబుతున్నాడు. పోలీసులు సైతం రౌడీషీటర్లకు వత్తాసు పలుకుతున్నారని, నగర పోలీస్ కమిషనర్ విచారణ చేసి చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నాడు. పోలీసులకు తనపై దాడి చేయాలనుకుంటున్న వారి వివరాలు చెబుతున్నప్పటికి పట్టించుకోవడం లేదని, తిరిగి నా పైనే కేసులు పెడతామని అంటున్నట్లు తెలిసిందని వాట్సాప్ ద్వారా వాపోతున్నాడు.

**షహబాజ్ చెబుతున్న దాంట్లో వాస్తవం లేదు ఎస్ఐ విశ్వనాథ్ రెడ్డి :**

షహబాజ్ కు మరొక యువకుని మధ్య విభేదాలు ఉన్నాయని మైలార్దేవుపల్లి ఎస్ఐ విశ్వనాథ్ రెడ్డి తెలి పారు. షహబాజ్ చెబుతున్న విషయంలో వాస్తవం లేదన్నారు. ఈ కేసులో విచారణ కొనసాగుతున్నదన్నారు. షహబాజ్ అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు.

## క్రైస్తవ ఆధ్యాత్మిక నాయకులను కలసి సన్మానించిన రాజేంద్రనగర్ పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు



రెవరెండ్ డాక్టర్ జాషువా గుమ్మళ్ళ ను సన్మానిస్తున్న రాజేంద్రనగర్ పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు


రెవరెండ్ డాక్టర్ జి ఎస్ విజయ భూషణం ఆశీర్వాదాలు తీసుకుంటున్న రాజేంద్రనగర్ పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీ సభ్యులు


రెవరెండ్ డాక్టర్ కె నతానియేల్ ను సన్మానిస్తున్న రాజేంద్రనగర్ పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ సభ్యులు

**బుద్వేల్, మార్చి 30 (ప్రభాత ఉదయం)**

రాజేంద్రనగర్ పాస్టర్స్ ఫెలోషిప్ కు నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు క్రైస్తవ ఆధ్యాత్మిక నాయకులు, రాజేంద్రనగర్ పాస్టర్స్ ఫెలోషిప్ గవర్నింగ్ బాడీ సభ్యులను కలిసి సన్మానించి వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా క్రైస్తవ ఆధ్యాత్మిక నాయకులు రెవరెండ్ డాక్టర్ జి ఎస్ విజయభూషణం , గవర్నింగ్ బాడీ సభ్యులు డాక్టర్ జాషువా గుమ్మళ్ళ , డాక్టర్ కె నతానియేల్ , రెవరెండ్ కె సుందర్ పాల్ లు మాట్లాడుతూ, రాజేంద్రనగర్ పాస్టర్స్ ఫెలోషిప్ కు ఎంతో పేరు ఉందని గుర్తు చేశారు. ఆ పేరును అలాగే నిలబెట్టాలని నూతన కమిటీ సభ్యులకు సూచించారు. మంచి కార్యక్రమాలు చేపట్టి అందరి మన్ననలు పొందాలన్నారు. ప్రార్థనలకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అందరిని కలుపుకుపోయి ఐకమత్యంగా ముందుకు సాగాలన్నారు. నాయకత్వంలో ఉన్నవారికి తగ్గింపు స్వభావం ఉండాలని తెలిపారు. నాయకులను సన్మానించిన వారిలో రాజేంద్రనగర్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు రెవరెండ్ సీ హెచ్ సునీల్ సామ్యూల్, ప్రధాన కార్యదర్శి పాస్టర్ ప్రణీత్ బాబు, కోశాధికారి పాస్టర్ బట్టు శ్రీకాంత్, ఉపాధ్యక్షులు పాస్టర్ ప్రమోద్, సంయుక్త కార్యదర్శి పాస్టర్ సోమారం రాజ్ కుమార్, కమిటీ సభ్యులు రెవరెండ్ ఎం విజయ్ కుమార్, పాస్టర్ యేసు రత్నం, పాస్టర్ గుంటి డానియల్, పాస్టర్ గోపాల్ నాయక్, బ్రదర్ రాజ్ కుమార్ ఇశ్రాయేల్ లు ఉన్నారు.


రెవరెండ్ కె సుందర్ పాల్ ను సన్మానిస్తున్న రాజేంద్రనగర్ పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీ సభ్యులు

# ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి



అర్జీలను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్



పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

### జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ

**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 30(ప్రభాత ఉదయం):**

ప్రజావాణిలో వివిధ సమస్యలతో వచ్చే ప్రజల అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ అధికారులను ఆదేశించారు.సోమవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్ తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ ఫిర్యాదులను స్వీకరించి, పరిశీలించారు. ఈ సందర్భంగా (232) అర్జీలను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు కేటాయిస్తూ, ప్రజా సమస్యలపై తగిన చర్యలు తీసుకొని, త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ ప్రజావాణిలో ఆర్డీఓలు గోపీరాం, వెంకన్న, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షా చేస్తున్న జిల్లా కలెక్టర్

## మత్తు పదార్థాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి

### యువత మత్తుకు బానిస కావొద్దు.. ఉజ్వల భవిష్యత్తును పాడుచేసుకోవద్దు

### జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ

**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 30(ప్రభాత ఉదయం):**

మత్తు పదార్థాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో డీసీపీ రాజ మహేంద్ర నాయక్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్ లతో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ మత్తు పదార్థాల నియంత్రణపై విద్యా, వ్యవసాయ, ఎక్సైజ్, పోలీసు, వైద్య శాఖ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. పాఠశాలలు, కళాశాలల్లో మత్తు పదార్థాల నివారణపై పెయింటింగ్, వ్యాస రచన పోటీలు నిర్వహించి, విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్ పరిధిలో మత్తు పదార్థాల నియంత్రణపై విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని, ఇలాంటి అవగాహన కార్యక్రమాల ఏర్పాటుతో సమాజంలో మార్పు తీసుకురావచ్చన్నారు. మత్తు పదార్థాల రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టాలని, దాబాల వద్ద ప్రత్యేక దృష్టి సారించాలని, ఎప్పటికప్పుడు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలన్నారు.యువత మత్తుకు బానిస కావొద్దని, ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని తెలిపారు.ఈ సమీక్ష సమావేశంలో డీఏఓ అంబికా సోనీ, ఎక్సైజ్ ఎస్పీ అనిత, ఆర్టీఓ శ్రీనివాస్ గౌడ్ , డీఎంహెచ్ఓ మల్లికార్జున రావు, ఇతర సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పేయింట్ షాపులో అగ్నిప్రమాదం.. షార్ట్ సర్క్యూటే కారణం

**గద్వాల జిల్లా ప్రతినిధి, మార్చి 30(ప్రభాత ఉదయం)**



జిల్లా కేంద్రంలోని చిన్న అగ్రహారం సమీపం లో గల ఎం.నారాయణ కాంప్లెక్స్ లో ఓ ఫేయింట్ దుకాణంలో సోమవారం తెల్లవారుజామున షార్ట్ సర్క్యూట్ తో అగ్నిప్రమాదం సంభవించింది. సోమవారం తెల్లవారుజామున ఫేయింట్ షాప్ ముందు బాగంలో ఉన్న కిరాణం షాపు నుండి పొగలు రావడంతో స్థానికులు గమనించి దుకాణం యజమానులకు, పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఫైరింజన్ల సాయంతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. కానీ అప్పటికే షాపులోని పెయింట్ డబ్బాలు, ఇతర సామగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.35 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపారు. అదే విధంగా ముందు భాగంలోఉన్న కిరాణం షాపులో కి మంటలు వ్యాపించడంతో కిరాణం షాపులోని కొంత సామాగ్రి కాలిపోవడంతో కొంత ఆస్థి నష్టం వాటిలింది. పేయింట్ షాపు పాత బిల్డింగ్లో ఉండటంతో మంటలు ఆర్పేందుకు అగ్నిమాపక సిబ్బంది కొంత ఇబ్బంది పడారు. ఫేయింట్ షాపులో షాట్ సర్క్యూట్ వల్లే ఈ ప్రమాదం చోటు చేసుకుందని అగ్నిమాపక సిబ్బంది పేర్కొన్నారు. సంఘటన స్థలాన్ని పట్టణ పోలీసులు సందర్శించారు.



## దివ్యాంగుల సాధికారతకు కొత్త దిశ

### జీఎల్ఆర్ఏ ఇండియా మహత్తర ప్రాజెక్ట్ ప్రారంభం

**కూకట్ పల్లి, మార్చి 30 (ప్రభాత ఉదయం)**

భారతదేశంలో అణగారిన వర్గాల అభివృద్ధికి కట్టుబడి ఉన్న జీఎల్ఆర్ఏ ఇండియా మరో ముఖ్యమైన అడుగు ముందుకు వేసింది. 1966లో జీఎల్ఆర్ఏ గ్లోబల్ అనుబంధంగా స్థాపించబడిన ఈ లౌకిక, లాభాపేక్షలేని సంస్థ దేశవ్యాప్తంగా సేవలందిస్తూ విశ్వసనీయ గుర్తింపు పొందింది. దక్షిణ భారతదేశంలో దివ్యాంగుల సామాజిక సమ్మిళితం, సాధికారతను బలోపేతం చేయాలనే లక్ష్యంతో జీఎల్ఆర్ఏ ఇండియా ఒక ప్రత్యేక ప్రాజెక్టును ప్రారంభించింది. ఈ ప్రాజెక్టును జర్మనీ ఫెడరల్ మంత్రిత్వ శాఖ, డి.ఎ.హెచ్.డబ్ల్యూ సహకారంతో అమలు చేస్తున్నారు. ముఖ్యంగా ఈ కార్యక్రమం ద్వారా వైకల్యాలున్న మహిళలకు ఆరోగ్య సంరక్షణ, విద్యా అవకాశాలు, సామాజిక భద్రత, జీవనోపాధి మార్గాలు మెరుగుపరచడంపై ప్రత్యేక దృష్టి సారించారు. దివ్యాంగుల కోసం మరింత సమ్మిళితమైన, సహాయక వాతావరణం సృష్టించడమే ఈ ప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యం. ఈ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రముఖులు పాల్గొన్నారు. డాక్టర్ దినేష్ జీఎల్ఆర్ఏ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ శ్రీ విక్రమ్ దేవ్ రావు (శివానంద ప్రెసిడెంట్), మీరా రావు (శివానంద సెక్రటరీ), డా. అనంత రెడ్డి (శివానంద సీఈఓ) ఇవారితో పాటు ఎన్టీఆర్ డీ కేంద్ర అధ్యక్షులు కొల్లి నాగేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షులు వెంకట్ అందరూ కలిసి జ్యోతి ప్రజ్వలన చేస ప్రాజెక్టును ప్రారంభించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ విభాగాల భాగస్వామ్యం ఈ కార్యక్రమానికి స్త్రీ–శిశు సంక్షేమ శాఖ నుంచి సిడిపిఓ రేణుక సూపర్వైజర్ జ్యోతి హాజరై తమ మద్దతు తెలిపారు. సమాజానికి శక్తివంతమైన అడుగు ఈ ప్రాజెక్ట్ ద్వారా దివ్యాంగుల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకురావడమే కాకుండా, వారికి సమాన అవకాశాలు కల్పించే దిశగా సమాజాన్ని ముందుకు నడిపించే ప్రయత్నంగా ఇది నిలుస్తోంది. "సమానత్వం -- సాధికారత -- సమ్మిళితం" అనే లక్ష్యంతో జీఎల్ఆర్ఏ ఇండియా తీసుకున్న ఈ అడుగు నిజంగా అభినందనీయం.



## పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

### సన్న బియ్యం పంపిణితో ప్రతీ పేదవాడి ఆకలి తీరింది

### ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్

**కూకట్ పల్లి, మార్చి 30 (ప్రభాత ఉదయం)**

గత ఏడాది ఉగాది కానుకగా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చేతులమీదుగా ప్రారంభించిన పేదలకు సన్నబియ్యం పంపిణీ పథకం ఏడాది కాలం పూర్తిచేసుకున్న సందర్భంగా అల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎన్.టి.ఆర్ నగర్ కాలనీలోని వి.శ్రీనివాస్ అనే వికలాంగుని కుటుంబం వారి ఇంటికి డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ని మర్యాదపూర్వకంగా ఆహ్వానించి, సన్న బియ్యంతో భోజనం వండి వడ్డించారు. ఈ సందర్భంగా వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ సన్న బియ్యం బువ్వతో సి.ఎం రేవంత్ రెడ్డి తెలంగాణ పేద ప్రజల గుండెల్లో నిలిచిపోయారని అన్నారు. గత ఏడాది నుండి రేషన్ దొడ్డు బియ్యం స్థానంలో నాణ్యమైన సన్న బియ్యం పంపిణి రేషన్ దుకాణాల ద్వారా నిరంతరాయంగా జరుగుతోందని అన్నారు. రేషన్ కార్డు ఉన్న లబ్ధిదారులకు ఒక్కొక్కరికి ఆరు కేజీల చొప్పున సన్నబియ్యం అందించడం కాంగ్రెస్ ప్రభుత్వం ఘనత అని అన్నారు. అక్రమాలకు అడ్డుకట్ట వేస్తూ పేదలకు నాణ్యమైన బియ్యం అందించడమే లక్ష్యంగా ఈ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని అన్నారు. పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని స్పష్టం చేశారు. ఇంటికి పిలిచి సన్నబియ్యంతో అన్నం వండి అందించిన శ్రీనివాస్, మాధవి దంపతులను వెంకటేష్ గౌడ్ శాలువాతో సన్మానించి గౌరవించారు. ఈ కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, సి హెచ్.భాస్కర్, పోశెట్టిగౌడ్, ఖాజా, రవీందర్, వివేక్, దుర్గ తదితరులు పాల్గొన్నారు.




## వ్యాపార దుకాణాల్లో చెత్త డబ్బాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి

### అమీన్ పూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్

**పటాన్ చెరు, మార్చి 30 (ప్రభాత ఉదయం):**

వ్యాపార కార్యకలాపాలు సాగిస్తున్న దుకాణాల్లో తప్పనిసరిగా చెత్త డబ్బాలు ఏర్పాటు చేయాలని అమీన్ పూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్ ఆదేశాల మేరకు బొల్లారం డివిజన్ శానిటరీ ఇన్స్పెక్టర్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో ప్రతి వ్యాపార దుకాణంలో చెత్త డబ్బాలు ఉండాలని ప్రతి దుకాణదారుడు కి అవగాహన కల్పిస్తూ గోడ పత్రికలను అతికించారు. చెత్త డబ్బాలు పెట్టక పోతే భారీ జరిమానాలు తప్పవని దుకాణదారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య ఉద్యోగి హరీష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



## శ్రీ హరిహర పుత్ర ధర్మశాస్త్ర అయ్యప్ప క్షేత్రం ఆలయ నిర్మాణానికి 1,10,016/- విరాళం అందజేసిన చీర్ల లక్ష్మయ్య దంపతులు

**కొత్తకోట, మార్చి 30(ప్రభాత ఉదయం)**

కొత్తకోట పట్టణంలో నిర్మిస్తున్న శ్రీ హరిహర పుత్ర ధర్మశాస్త్ర అయ్యప్ప క్షేత్రం ఆలయ నిర్మాణానికి కొత్తకోట పట్టణానికి చెందిన స్వర్గీయ చీర్ల దస్తగిరి జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు చీర్ల జానమ్మ ,చీర్ల లక్ష్మయ్య దంపతులు , ఆయన కుమారుడు చీర్ల వెంకటయ్య లు 1,10,016/- ( ఒక లక్ష పది వేల పదహారు రూపాయలు ) విరాళాన్ని అయ్యప్ప సేవా సమితి అధ్యక్షులు ధూపం నాగరాజు , ప్రధానకార్యదర్శి పొగాకు అనీల్ కుమార్ , కోశాధికారి విశ్వనాథం గంగాధర్ , ఆలయ పూజారి జంగం నటరాజ్ , నిర్వాహకులు సత్యం సాగర్ , వేముల సుధాకర్ రెడ్డి , లక్ష్మీ నారాయణ యాదవ్ , పబ్బ నరేందర్ గౌడ్ , గోవిందు , కౌన్సిలర్ తిరుపతయ్య లకు అందజేశారు . ఈ సందర్భంగా ఆలయ కమిటీ అర్చకులు జంగం నటరాజ్ , చీర్ల లక్ష్మయ్య కుటుంభ సభ్యులను శాలువాతో సన్మానించి ఆశీర్వదించగా ఆలయ నిర్వాహకులు ధన్యవాదములు తెలిపారు.

## రూ.25 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన తిమ్మాజిపేట ఎస్సై

**నాగర్ కర్నూల్, మార్చి 30 (ప్రభాత ఉదయం)**



నాగర్ కర్నూల్ జిల్లాలో ఓ పోలీసు అధికారి లంచం తీసుకుంటు ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డాడు.ఓ వ్యక్తి నుంచి రూ.20వేలు లంచం తీసుకుంటూ ఎస్సై పట్టుబడిన సంఘటన నాగర్ కర్నూల్ జిల్లాలో చోటు చేసుకుంది. ఒక కేసుకు సంబంధించి ఈనెల 07న ఒక వ్యక్తి వద్ద నుంచి రూ. 30 వేలు డిమాండ్ చేసి రూ.25వేలు లంచం తీసుకున్న నాగర్ కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట ఎస్సై హరిప్రసాద్ రెడ్డినీ సోమవారం మహబూబ్ నగర్ ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ ఆధ్వర్యంలో అదుపులోకి తీసుకున్నారు.ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం..ఇసుక కొడుతున్న ఓ వ్యక్తికి సంబంధించిన ట్రాక్టర్, జేసీబీని పట్టుకొని ఈనెల 5వ తేదీన ఎస్సై హరిప్రసాద్ రెడ్డి కేసు నమోదు చేసి వివరాలను నాగర్ కర్నూల్ జిల్లా మైనింగ్ అధికారులకు తెలిపారు. మైనింగ్ అధికారులు ఆ వాహనాలకు రూ. 60వేలు ఫైన్ వేశారు. ఈ డబ్బులను ఈనెల 7వ తేదీన చెల్లించి వాహనాల రిలీజ్ కోసం పత్రాలను తెచ్చి ఎస్సైకి ఇచ్చాడు. రూ. 30 వేలు ఇస్తేనే వాహనాలను విడుదల చేస్తాను అని ఎస్సై చెప్పాడు. మైనింగ్ ఫైన్ కట్టడంతో పాటు.. మళ్లీ రూ.30 వేలు కట్టవలసి రావడంతో వాయిస్ రికార్డింగ్ లు..20వేల రూపాయలు చెల్లించిన అంశాలతో ఆ వ్యక్తి ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు.అన్ని ఆధారాలతో ఏసీబీ అధికారులు సోమవారం పోలీస్ స్టేషన్ కు చేరుకొని ఎస్సైని అదుపులోకి తీసుకున్నారు.ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు డి.ఎస్.పి బాలకృష్ణ వెల్లడించారు"

## కొన్నే గ్రామంలో వివో బిల్డింగ్‌కు శంకుస్థాపన చేసిన గ్రామ సర్పంచ్

**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 30(ప్రభాత ఉదయం):**



జిల్లా లోని బచ్చన్నపేట మండలం, కొన్నే గ్రామంలో సోమవారం వివో బిల్డింగ్ కు గ్రామ సర్పంచ్ కోడూరు స్వర్ణలత శివకుమార్ గౌడ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని వారు బాగుపడితేనే గ్రామం బాగుపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ చల్ల కమలాకర్, వార్డు మెంబర్లు ప్రదీప్, సందీప్, నరేష్, శ్రీనివాస్, రేణుక, మధుసూదన్, కమల, కల్పన, వివో సంఘ అధ్యక్షులు గ్రామ కార్యదర్శి భాగ్యరాజ్, మహిళా సంఘ నాయకులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# గద్వాల ఎమ్మెల్యేను వెంటనే బర్తరఫ్ చేయాలి

**జాబ్ క్యాలెండర్ బదులు దోపిడి క్యాలెండర్ అమలు పరుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం**

**గద్వాల జిల్లా ప్రతి నిధి, మార్చి 30(ప్రభాత ఉదయం)**



పార్టీ ఫిరాయింపు కేసుల్లో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అధికార కాంగ్రెస్ పార్టీలో చేరిన కూడా తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ పార్టీ మారలేదని తీర్పు ఇచ్చారని, తెలంగాణ అసెంబ్లీలో ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేశారని, మరి గద్వాల ఎమ్మెల్యే బండ్లను ఎందుకు సస్పెండ్ చేయలేదని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి అర్.ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు. సోమవారం బీఆర్ఎస్వీ నాయకులు కుర్వపల్లయ్య ఆధ్వర్యంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నాగర్ దొడ్డి వెంకట్రాములు అధ్యక్షతన ఫీజు రీయింబర్స్ మెంట్ బజాయిల విడుదలకై మరియు ఉద్యోగాల భర్తీ కై గద్వాలలో విద్యార్థుల, నిరుద్యోగు పోరు దీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాల అవుతున్న విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ రూ.9,000 కోట్ల బకాయిలు పెండింగ్ లో పెట్టడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రైవేట్ కళాశాలల కు బకాయిలు చెల్లించనందున ఇంజనీరింగ్, వైద్య, టెక్నికల్ ఇతర కళాశాలలు మూసివేయడానికి సిద్ధమవుతున్నారని ఆరోపించారు. కళాశాలల యాజమాన్యం ఎన్నోసార్లు ప్రభుత్వానికి విన్నవించిన బకాయిలు చెల్లించడం లేదన్నారు విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ మొత్తాన్ని చెల్లించకపోతే గద్వాలలో జరిగిన పోరు దీక్ష రాష్ట్రమంతా పోరుబాటగా మారుతుందని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల వేధింపులు తాళలేక, గురుకులాలలో మౌలిక సదుపాయాలు కల్పించకుండా, కలుషిత ఆహారం తినడం వలన రాష్ట్రంలో ఇప్పటికి 127 మంది విద్యార్థులు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. అదే ఇవ్వాళ రాష్ట్రంలో కేసిఆర్ సీఎంగా ఉంటే విద్యార్థులకు ఆ పరిస్థితి వచ్చేది కాదని, వ విద్యార్థులకు బంగారు భవిష్యత్ ఉండేదని గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మంత్రుల కబ్జాలు అక్రమాలు పెరిగిపోయాయని, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి 900కోట్ల రూపాయాలతో దోపిడి చేసి కేరళలో ఎన్నికల ప్రచారానికి డబ్బులు తరలించారని, అదే డబ్బులతో రాష్ట్ర ంలో నిరుద్యోగులకు కోచింగ్ సెంటర్ లను ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. నిరుద్యోగులకు సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తానని అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లో రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తానని నమ్మబలికారు వాగ్దానాలతో నిరుద్యోగులను మభ్యపెట్టి మభ్యపెట్టి అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు అవుతున్న నేటికీ 16 వేల ఉద్యోగాలు మాత్రమే భర్తీ చేసినట్టు అసెంబ్లీ సాక్షిగా ప్రకటించాడనే ఇక మిగిలిన రెండేళ్లలో ఎలా ఉద్యోగాలు ఇస్తాడని ప్రశ్నించారు. ఇకనైనా నిరుద్యోగులు మేలుకోని పోరుబాట పట్టాలని పిలుపునిచ్చారు. నడిగడ్డలో ప్రారంభమైన ఈ ఉద్యమం రాష్ట్రమంతా విస్తరించి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలదొస్తామని , ఇప్పటికైనా మేల్కొని నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ ప్రకటించి, రెండు లక్షల ఉద్యోగాలు వెంటనే భర్తీ చేయాలని విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ బకాయిల మొత్తం చెల్లించాలని డిమాండ్ చేశారు. .ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు దీ=ూ పార్టీ పోరాటం ఆగదు అని ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతూనే ఉంటాం అని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో గద్వాల నియోజకవర్గ ఇంచార్జి బాసు హన్మంతునాయుడు, మాజీ జెడ్పీటిసి పద్మా వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బిఎస్కేశవ్, నాయకులు జీ.రాఘవేంద్ర రెడ్డి, చక్రధర్ రావు, సూర్య గౌడ్, కోటేష్, మోనేష్, కౌన్సిలర్లు,ఐజ పట్టణ అధ్యక్షుడు మధు కుమార్, అలంపూర్ పట్టణాధ్యక్షుడు వెంకట రామయ్య శెట్టి, మైనారిటీ నాయకులు అతికూర్ రెహ్మాన్, గుమ్మ గోవర్ధన్, రంగస్వామి, పాలమూరు యూనివర్సిటీ అధ్యక్షుడు గడ్డం భరత్ బాబు, మల్దకల్, పైపాడు రాజు, గంజిపేట రాజు, ముని మౌర్య, గాజుల కృష్ణారెడ్డి, రంజిత్ కుమార్, గోవిందు,మహేష్, నాయకులు, నిరుద్యోగులు విద్యార్థులు పాల్గొన్నారు.




## కార్మిక గొంతుకలపై ఉక్కుపాదం దారుణం!

**ఖైదీల కంటే హీనమా? అర్ధరాత్రి వేళల్లో ఆశా వర్కర్ల ఇళ్లపై పోలీసుల 'దాడులు'!**

**సిఐటియు ఆధ్వర్యంలో బాలానగర్ లో నిరసనలు**

**కూకట్ పల్లి, మార్చి 30 (ప్రభాత ఉదయం)**

తమ న్యాయమైన హక్కుల కోసం, కడుపు ఆకలి తీర్చుకోవడం కోసం ప్రశ్నిస్తున్న ఆశా వర్కర్లను, కార్మిక నాయకులను అక్రమంగా నిర్బంధించడం ప్రభుత్వ నిరంకుశత్వానికి పరాకాష్ఠయని సిఐటియు బాలానగర్ మండల కమిటీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తింది. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో కార్మికులు ప్రభుత్వ మొండి వైఖరిని, పోలీసుల అత్యుత్సాహాన్ని ఖండించారు. ఖైదీల కంటే హీనంగా పోలీసులు కార్మికుల పట్ల ప్రవర్తనే ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టామని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్, తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు అనిత పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ఖాకీలను అడ్డం పెట్టుకుని పాలన సాగిస్తోందని మండిపడ్డారు. పోలీసులు దొంగలను పట్టుకున్నట్లుగా, అర్ధరాత్రి వేళల్లో కార్మిక నాయకుల ఇళ్లపైకి వెళ్లడం ఏ రకమైన ప్రజాస్వామ్యమని వారు ప్రశ్నించారు. నిద్రపోతున్న మహిళా వర్కర్ల ఇళ్లకు వెళ్లి చుట్టుపక్కల వారిని విచారిస్తూ భయభ్రాంతులకు గురిచేయడం అత్యంత హేయమైన చర్యయని విమర్శించారు. కార్మికులు అద్దె ఇళ్లలో నివసిస్తున్నారనే కనికరం కూడా లేకుండా పోలీసులు పదేపదే రావడం వల్ల, యజమానులు ఇళ్లను ఖాళీ చేయిస్తున్నారని, దీనికి బాధ్యత ఎవరు వహిస్తారని నిలదీశారు. ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులా?: హక్కుల కోసం గళమెత్తడం నేరమా? అని వారు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అక్రమ అరెస్టులు, పోలీసు నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని, ఇది కేవలం ప్రభుత్వ పతనానికి దారితీస్తుందని వారు హెచ్చరించారు. పోలీసు యంత్రాంగం ప్రభుత్వం చేతిలో కీలుబొమ్మలా మారి సామాన్య కార్మికులను వేధించడం ఆపకపోతే, రాబోయే రోజుల్లో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని నాయకులు స్పష్టం చేశారు. నిర్బంధాలతో భయపెట్టాలని చూస్తే తిరుగుబాటు తప్పదని వారు ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అనిత, సబియా, భాగ్యలక్ష్మి, రేవతి, సోమలత, విజయలక్ష్మి, పుష్ప,తదితరులు పాల్గొన్నారు.

## బాధితుల సమస్యల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలి: జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు


**గద్వాల ప్రతినిధి, మార్చి 30(ప్రభాత ఉదయం)**



బాధితుల సమస్యల పట్ల బాధ్యతగా వ్యవహరించి వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. సోమవారం పోలీసు ముఖ్య కార్యాలయం లో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించిన జిల్లా ఎస్పీకి, జిల్లా నలుమూలల నుండి సుదూర ప్రాంతాల వారు నేరుగా ఫిర్యాదులను సమర్పించి వారి సమస్యలను విన్నవించుకున్నారు. సమస్యలను తెలియజేసిన వెంటనే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు ఇచ్చి ఫిర్యాదుల పట్ల వారి సమస్యల పట్ల వెంటనే సిబ్బందిని కేటాయించి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. వచ్చిన పిర్యాదులలో పొలానికి సంబంధించి - 3, గొడవలకు సంబంధించి - 1, గర్ల్ మిస్సింగ్ సంబంధించి -1, అధిక వడ్డీలకు సంబంధించి - 1, ఇతర విషయాలకు సంబంధించి - 4,మొత్తం 10 ఫిర్యాదులు అందాయి అని తెలిపారు.ఈ కార్యక్రమంలో గద్వాల్ డి.ఎస్పీ. వై మొగిలయ్య, గద్వాల్ శాంతినగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్లు టి. శ్రీను, ప్రదీప్, టాటాబాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**కేటిదొడ్డి, మార్చి 30(ప్రభాత ఉదయం)**



తాసిల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కేటిదొడ్డి తహసీల్దార్ కరుణాకర్ అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం తసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో మండలంలోని ఇద్దరు రెవెన్యూకు సంబంధించిన ఫిర్యాదులు సమర్పించారన్నారు. భూమికి సంబంధించిన సమస్యలు ఏవైనా ఉంటే సమస్యకు సంబంధించిన భూ పత్రాలను తీసుకొచ్చి కార్యాలయంలో సిబ్బందికి దాఖలు చేసుకోవాలని తెలిపారు. సమస్య పరిష్కారంపై కార్యాలయ సిబ్బంది తగు సూచనలు, సలహాలను అందించడం జరుగుతుందని తెలిపారు. రైతులు భూభారతీకి సంబంధించిన సమస్యలను నివృత్తి చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమణారావు, ఎంఏఓ రాజవర్ధన్ రెడ్డి, ఎంఈఓ విజయభాస్కర్, వివిధ రకాల శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బొల్లారంలో షార్ట్ సర్క్యూట్ తో ఇల్లు దగ్ధం

**నాలుగు ద్విచక్ర వాహనాలు అగ్నికి ఆహుతి**

**నిరాశ్రయులైన 16 కుటుంబాలు**

**పటాన్ చెరు, మార్చి 30 (ప్రభాత ఉదయం):**




బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో వెంకటరెడ్డి నగర్ లో అర్ధరాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. ఉమామహేశ్వరరావు కు చెందిన నివాసం లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది.వెంకట్ రెడ్డి నగర్ కాలనీలోని ఈ మూడు అంతస్తుల భవనంలో 16 కుటుంబాలకు చెందిన దాదాపు 60 మంది వరకు నివసిస్తుంటారు. అర్ధరాత్రి 2:30 గంటల సమయంలో కరెంటు ప్యానెల్ బోర్డు ద్వారా షార్ట్ సర్క్యూట్ అయి గ్రౌండ్ ఫ్లోర్ లో ఉన్న నాలుగు బైకులకు మంటలు అంటుకొని మంటలు వ్యాపించాయి.ఇది గమనించిన ఒక వ్యక్తి అందరినీ అప్రమత్తం చేయడంతో భవనంలో లో ఉన్న 16 కుటుంబాలను అందరినీ వెనుక గేట్ ద్వారా ముందు గేట్ ద్వారా బయటకు చేరుకున్నారు. వెంటనే 100 డయల్ కాల్ చేసి సమాచారం ఇవ్వడంతో ఫైర్ ఇంజన్ హైడ్రా డిజాస్టర్ మేనేజ్మెంట్ సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తీసుకుని రావడం వల్ల ఎవరికి ప్రాణ నష్టం వాటిల్లలేదని బొల్లారం పోలీస్ ఇన్స్పెక్టర్ ఎం రవీందర్ రెడ్డి తెలిపారు.

## కడవెండి పాఠశాల ఆవరణలో కూలడానికి సిద్ధంగా ఉన్న ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్

**- శిథిలావస్థలో ఉన్నా.. పట్టించుకునే నాధుడే లేడు**

**- భయాందోళనలో ఉన్న విద్యార్థులు, తల్లిదండ్రులు..**

**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 30 (ప్రభాత ఉదయం)**



జిల్లాలోని దేవరుప్పుల మండలం కడవెండి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ పెంకులు ఊడిపోయి, ఇనుప చువ్వలు తెలిపోయి శిథిలావస్థలో ఎప్పుడు కూలుతుందో..? చెప్పలేని పరిస్థితి లో ఉండడంతో ప్రజలు భయాందోళనతో వణికిపోతున్నారు. వాటర్ ట్యాంక్ స్కూల్ ఆవరణలో ఉండడంతో ఇక్కడే అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల కూడా నడుస్తున్నాయి. వీటిలోని విద్యార్థులు ఇక్కడ నిత్యం ఆడుకుంటారు. వారికి తెలియకుండా ట్యాంక్ క్రింద కు వస్తే తీవ్ర ప్రమాదం జరిగే అవకాశం ఉందని, ఈ ట్యాంక్ కట్టి దాదాపు 30 సంవత్సరాలు దాటిపోయి, కూలడానికి సిద్ధంగా ఉన్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యారంటూ గ్రామ ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఎలాంటి ప్రమాదాలు జరగక ముందే ముందస్తు జాగ్రత్తలు తీసుకొని ఆ ఓవర్ హెడ్ ట్యాంక్ ను కులగొట్టి దాని స్థానంలో కొత్త వాటర్ ట్యాంకర్ ను నిర్మించాలని సంబంధిత అధికారులను కడవెండి గ్రామ ప్రజలు కోరుతున్నారు.




## ప్రజాస్వామ్య పరిరక్షణ హామీ ఏమైంది:

**సిఐటియు జిల్లా అధ్యక్షులు ఉప్పేర్ నరసింహ**

**గద్వాల జిల్లా ప్రతినిధి, మార్చి 30(ప్రభాత ఉదయం)**

కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ లతోపాటు,7 వ హామీగా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తామని హామీ ఇచ్చిందని, కానీ ప్రజాస్వామ్య పరిరక్షణలో దారుణంగా విఫలమైందని సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఉప్పేర్ నరసింహ అన్నారు. చలో హైదరాబాద్ సందర్భంగా హైదరాబాద్ కు వెళ్లిన ఆశా కార్యకర్తలపై లాఠీ ఛార్జ్ చేయడాన్ని నిరసిస్తూ సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా రాస్తారోకో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ఆశా కార్యకర్తలకు 18 వేల రూపాయల ఫిక్స్ వేతనం ఇస్తామని హామీ ఇచ్చిందని హామీలు అమలు చేయమని ప్రశ్నిస్తే ఆశా కార్యకర్తలపై అత్యంత నిరంకుశంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు .తమ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించిన ఆశాలపై,సిఐటీయూ రాష్ట్...



## పెద్ద చింతరేవుల దేవాలయంలో హుండీ లెక్కింపు

**12 నెలల హుండీ ఆదాయం రూ.10,73,245**

**గద్వాల జిల్లా ప్రతినిధి, మార్చి 30(ప్రభాత ఉదయం)**

ధరూర్ మండలం పెద్ద చింతరేవుల శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని సోమవారం దేవాదాయ శాఖ గద్వాల డివిజన్ పరిశీలకులు వెంకటేశ్వరీ, ఆలయ ఈఓ కవిత ఆలయ ధర్మకర్త గిరిరావు ఆధ్వర్యంలో మొదలుపెట్టారు. ప్రతి సంవత్సరం దేవదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉండి లెక్కింపు కార్యక్రమం జరుగుతుంది. హుండీ లెక్కింపులో 12 నెలలుగా దేవాలయానికి వచ్చిన ఆదాయం 10 లక్షల 73 వేల 245 రూపాయలు వచ్చిందనీ ఆలయ ఈఓ స్పష్టం చేశారు. గత సంవత్సరం తో పోలిస్తే ఈ సంవత్సరం రూ.1,35,045 ఆదాయం అదనంగా సమకూరిందని ఆలయ ఈఓ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భీంపురం గ్రామ సర్పంచ్ గాల్ల రఘు, ఆలయ ప్రధాన అర్చకులు, గ్రామ పెద్దలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇసుక డంపులను సీజ్ చేసిన రెవెన్యూ అధికారులు

**అయిజ, మార్చి 30(ప్రభాత ఉదయం)**



అయిజ మండలం తుంగభద్ర నదీ తీరాన ఉన్న పులికల్ గ్రామ శివారులో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులను సీజ్ చేసినట్టు తహసీల్దార్ జ్యోతి తెలిపారు. తుంగభద్ర నదీతీరాన సమీపంలో గల పులికల్ గ్రామ శివారులో గుర్తు తెలియని వ్యక్తులు 40 ట్రిప్పుల ఇసుకను డంప్ చేశారు. దీనిపై సమాచారం అందుకున్న తహసీల్దార్ జ్యోతి ఆదేశాల మేరకు రెవెన్యూ పోలీస్ అధికారులకు ఆకలిసి వెళ్లి ఇసుక డంపులను పరిశీలించారు. అనంతరం వారి సమక్షంలోనే ఇసుక డంపులను సీజ్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జ్యోతి మాట్లాడుతూ నదీ తీరం నుంచి అనుమతులు లేకుండా ఎవరైనా అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## చిత్తారమ్మ దేవాలయంలో ఏప్రిల్ 1న శ్రీ మహాలక్ష్మి యాగం

**భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలి**

**బిజెపి నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు**

**కూకట్ పల్లి, మార్చి 30 (ప్రభాత ఉదయం)**




లోక కల్యాణం, ప్రజా శ్రేయస్సును కాంక్షిస్తూ, లక్ష్మీ అమ్మవారి తిరు నక్షత్రం సందర్భంగా కూకట్పల్లి వివేకానంద నగర్లో ఉన్న చిత్తారమ్మ దేవాలయంలో ఏప్రిల్ 1వ తేదీన భారీ ఎత్తున శ్రీ మహాలక్ష్మి యాగం నిర్వహించనున్నారు. వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమానికి సంబంధించిన వివరాలను ఆలయ కమిటీ సభ్యులు వెల్లడించారు. ఏప్రిల్ 1వ తేదీ, ఉదయం 8 గంటల నుండి రాత్రి 11 గంటల వరకు నిరంతరాయంగా యాగం కొనసాగుతుంది. ఈ యాగాన్ని అత్యంత శాస్త్రోక్తంగా నిర్వహించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం నుండి ప్రత్యేకంగా అర్చకులు విచ్చేస్తున్నారు. ఐదు క్వింటాళ్ల పసుపుతో భారీ రాశిని ఏర్పాటు చేసి, దానిపై లక్ష్మీ యంత్రాన్ని ప్రతిష్టించి అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యంత భక్తిశ్రద్ధలతో, భారీ స్థాయిలో ఈ మహాలక్ష్మి యాగాన్ని నిర్వహించేందుకు సంకల్పించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం సామాన్య ప్రజల ప్రతి సమస్యను పరిష్కరిస్తుంది

**టిపిసిసి ఉపాధ్యక్షులు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్**

**కూకట్ పల్లి, మార్చి 30 (ప్రభాత ఉదయం)**



సామాన్య ప్రజల ప్రతి సమస్యను కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరిస్తుందని టిపిసిసి ఉపాధ్యక్షులు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా నిన్న బోరబండ శివయ్య బస్తీలో పర్యటించిన ఆయనకు స్థానికులు రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలలో జరుగుతున్న అసాంఘిక కార్యక్రమాలు, అక్కడ చెత్త వేయడం పైన ప్రజలు రమేష్ కి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆయన అప్పుడే రైల్వే ఉన్నతాధికారులకు, మున్సిపల్ అధికారులకు ఆయా సమస్యలను పరిష్కరించాలని ఫోన్లో మాట్లాడారు. ఈ విషయమై సోమవారం సౌత్ సెంట్రల్ రైల్వే డివిజన్ జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాత్సవ ని వ్యక్తిగతంగా కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. బోరబండ రైల్వే స్టేషన్ పరిధిలోని ఖాళీగా ఉన్న స్థలానికి ప్రహరీ గోడ నిర్మించి రక్షణ కోసం సెక్యూరిటీ ఏర్పాటు చేయాలని దీంతోపాటు వీధిదీపాలను ఏర్పాటు చేయాలని సూచించారు. అక్కడినుండి చెత్త డంపింగ్ ను తరలించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన రైల్వే జిఎం శ్రీ వాస్తవ వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్ మాట్లాడి తగిన ఏర్పాట్లను చేయాలని అధికారులని ఆదేశించారని బండి రమేష్ పేర్కొన్నారు. అలాగే ఆర్టీసీ అధికారులతో మాట్లాడి గతంలో బోరబండ రైల్వే స్టేషన్ కు ఆర్టిసి బస్సులు నడిచేవని వీటిని నిలిపివేయడంతో ప్రస్తుతం ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మళ్ళీ బస్సులను స్టేషన్ వరకు నడపాలని ఆర్టీసీ వారిని విజ్ఞప్తి చేశారు.